ప్రగతి - వనిత వినియోగదారుల కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# కిటుకు

- పులిపాక తాజుద్దీన్

"ఎన్నాళ్లని ఇలా ప్రొవిజినల్ సర్టిఫికెట్‌తో కాలం గడపాలండీ. ఇంత వరకూ బోర్డాఫ్ ఎడ్యుకేషన్ వాళ్లు నాకు నా స్కూలు ఫైనల్ ఒరిజినల్ సర్టిఫికెట్ ఇవ్వలేదు" అంది సుజాత భర్తతో దీనంగా. బిజినెస్ వ్యవహారాల్లో బిజీగా వుండే రావుకు ఇలాంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకునే తీరికే వుండదు. అయినా దీనవదనంతో ఉన్న భార్యను చూడగానే అతనికి ముచ్చటేసింది. కాపురానికొచ్చిన కొత్తల్లో ఆమెలో అతను చూచిన అందాలు మళ్లీ కనిపించాయి, మరింత శోభాయమానంగా.

"ఇప్పుడు నువ్వు స్కూలు ఫైనల్ పాస్ కాలేదని ఎవరంటున్నారు చెప్పు. చక్కగా బియ్యే పాసయ్యావు, బియిడీ పాసయ్యావు. ఎమ్మే పరీక్షకు వెళ్లబోతున్నావు" అన్నాడు ఆమెను సముదాయిస్తూ. "అక్కడే వచ్చిందండీ చిక్కు. ఇప్పుడు ఏమ్మే పరీక్షకు వెళ్లాలంటే మళ్లీ మరో ప్రొవిజినల్ సర్టిఫికెట్ కావాలి. మళ్లీ ఇరవై ఏళ్ల క్రితం వదిలేసిన స్కూలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాలి" అందామె.

"అయినా ఎందుకివ్వరుట నీ సర్టిఫికెట్?"

"ఏమో? సెకండరీ బోర్డు వాళ్లకి రాసి రాసి స్కూలు వాళ్లు అలసిపోయారట. మీ బాధలేవో మీరే పడండని నాకో ఉచిత సలహా పారేసింది హెడ్మిస్ట్రెస్." అంది సుజాత. ఎలాగైనా భార్య సమస్య పరిష్కరించి ఆమెను సంతోషపరచాలని ముచ్చటపడ్డాడు రావు.

"నాకు చెప్పావుగా. ఇక ఆ సంగతి మరచిపో. నీ సర్టిఫికెట్ నీకు తెప్పించి ఇచ్చే పూచీ నాది. అన్నట్టు నీ రోల్ నంబరు, పరీక్ష పాసైన సంవత్సరం మొదలైన వివరాలు వెంటనే నాకు అందజేయి" అన్నాడు రావు. సుజాతకు ఆనందం, ఆశ్చర్యం రెండూ కలిసి ఉక్కిరి బిక్కిరి చేసాయి. 'ఇంట్లో కూచుని వంట చేసుకునే భాగ్యానికి రెండు డిగ్రీలు చాలవా? ఇప్పుడు నువ్వు ఎమ్మే పాసకాకపోతేనేం' అంటాడనుకుంది సుజాత. అయినా దుఃఖాన్ని చెప్పుకోవడానికి రావు కన్నా ఆపులింకెవరనే ఉద్దేశంతో ఉపశమనం కోసం తన గోడు వెళ్లబుచ్చుకుంటే, అతనిలా దీక్షాకంకణదారుడు అయిపోవడం ఆమె కెంతో ఆనందాన్ని కలిగించింది. అతనికి కావాల్సిన ఇన్‌ఫర్మేషన్‌తోపాటు వేడివేడి కాఫీ కప్పు కూడా అందించింది. రెండోసారి కాఫీ అడిగితేనే ఆరోగ్య సూత్రాలు వల్లించే భార్యామణి ఇలా రాత్రి పదకొండు గంటలకి కాఫీ చేసి తెచ్చే సరికి రావు మరీ పెట్రేగి పోయాడు. మల్లెపూవు లాంటి తెల్లని కాగితం తీసుకుని ఒక బ్రహ్మాండమైన నోటీసును సెక్రటరీ బోర్డాఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ను మందలిస్తూ, హెచ్చరిస్తూ జడిపిస్తూ డ్రాఫ్టు చేసాడు. నోటీసు చాలా బాగా రాసానన్న తృప్తి కలిగింది. కరణేషు మంత్రీ అన్నారు కదా పెద్దలు. అందుకే దాన్ని భార్యకు చూపించాడు. అసలే కళకళలాడే సుజాత మొహం నోటీసు చూడగానే మరింత వెలిగిపోయింది. "చాలా బాగా రాసారండీ నోటీసు. దీన్ని ఎవరైనా లాయరుకు చూపించండి, ఇంకా మంచి సలహాలు ఏమైనా ఇస్తాడేమో" అంది రావుతో. భార్య తెలివితేటలకు ముగ్ధుడైన రావు ఆమె సలహాని పాటించడానికి నిశ్చయించుకున్నాడు.

* * *

తన చిన్ననాటి స్నేహితుడు అయిన లాయరు రాజు ఇంటికి మర్నాడు ఉదయమే చేరుకున్నాడు. కాఫీ సేవించిన తర్వాత తన సమస్యను చెప్పుకుని తను రాసుకొచ్చిన నోటీసు చూపించాడు. లాయర్ రాజు ఆ నోటీసు శ్రద్ధగా చదివి "చాలా బాగా డ్రాఫ్ట్ చేసావు బ్రదర్. ఈ మాత్రం తెలివి మా లాయర్లకే లేదు" అంటూ తనని పొగుడుతూ ఉంటే ఉబ్బితబ్బిబ్బు అయిపోయాడు. "మరి దీన్లో చేర్చవలసింది కానీ, మార్చవల్సింది కానీ ఏమైనా ఉందా" అన్నాడు హుషారుగా.

"ఏమీ లేదు. పెర్‌ఫెక్ట్‌గా ఉంది. అయితే అడ్రస్ మాత్రం మార్చెయ్. బోర్డు సెక్రటరీకి కాకుండా స్కూలు హెడ్మిస్ట్రెస్‌కి ఇవ్వు నోటీసు" అన్నాడు రాజు. అతని సలహా నచ్చకపోయినప్పటికీ "సరే నువ్వు చెప్పినట్టే చేస్తా" అన్నాడు రావు అప్రయత్నంగా.

"కేరీ ఆన్, జవాబు రాగానే నాకు చూపించు. ఈ నోటీసు కాపీని దగ్గరుంచుకో" అన్నాడు రాజు. స్నేహితుడికి థేంక్స్ చెప్పి అక్కణ్ణించి తిన్నగా పోస్టాఫీసు కెళ్లి రిజిష్టర్డ్ పోస్టులో నోటీసుని హెడ్మాష్టరమ్మకు పంపించేసాడు రావు.

మూడు రోజుల తర్వాత హెడ్మిస్ట్రెస్ తరపున గవర్నమెంటు ప్లీడరు దగ్గర్నుంచి జవాబు వచ్చింది. పరీక్షలు నిర్వహించడం, స్కూలుకు చేరిన సర్టిఫికెట్లని విద్యార్థులకు అందించడం తప్ప, సర్టిఫికెట్లను పొందడానికి అర్హులెవరో నిర్ణయించవలసింది బోర్డు వారే కానీ, స్కూలు వారు ఎంత మాత్రంకాదని. విద్యార్థిని వినతి మేరకు తమ వంతు బాధ్యతగా బోర్డువారికి స్కూలు వారు పది ఉత్తరాలు వ్రాసారనీ, (వాటి నంబర్లు, తేదీలు కూడా ఇవ్వబడ్డాయి) అయినా బోర్డు వారు ఉలుకూ పలుకూ లేకుండా ఊరుకుంటే అది తమ బాధ్యత కాదని ఒక వేళ నోటీసులోహెచ్చరించినట్టు హెడ్మిస్ట్రెస్‌ను కోర్టుకు లాగితే ఆపై జరిగే పరిణామాలను తట్టుకోవడానికి సిద్ధంగా వుండమనీ దాని సారాంశం. ఆ జవాబు చూసిన సుజాత నీరు కారిపోయింది. డ్యూటీ నుంచి తిరిగొచ్చిన భర్తకు ఆ జవాబు చూపించింది. "అనవసరంగా వకీలు దగ్గరకు వెళ్లమన్నానండీ. అయినా స్కూలు వాళ్లను జడిపిస్తే వాళ్లేం చేస్తారు పాపం. అందుకే ఘాటుగా జవాబు ఇచ్చారు మనకు" అంది నిష్టూరంగా. ఆమె మాటల్లో సత్యం స్పష్టంగా కనిపిస్తున్నా, తన చిన్ననాటి స్నేహితుణ్ణి అలా ఆడిపోసుకోవడం నచ్చలేదతనికి. "వాడికి తోచిన సలహా వాడిచ్చాడు. పైగా జవాబు రాగానే తన దగ్గరకు రమ్మన్నాడు. నువ్వు బయల్దేరు. వాడి ఆఫీసుకు వెళదాం" అన్నాడు రావు.

ఇద్దరూ కలిసి రాజు ఆఫీసుకు చేరుకున్నారు, మరో గంటలో.

"నోటీసుకు జవాబు వచ్చింది" అన్నాడు రావు.

"వెరీ గుడ్, రేపు డ్యూటీకి వెళుతున్నప్పుడు తెచ్చిస్తే సరిపోయేది కదా. అనవసరంగా మా వదినగారినెందుకు ఇబ్బంది పెట్టావ్" అన్నాడు రాజు సుజాతను చూస్తూ. మా ఆవిడ నిన్ను ఉత్త దద్దమ్మ అనుకుంటోంది అని చెప్పడం ఇష్టం లేక "అబ్బే, ఇద్దరం షాపింగుకు బయల్దేరాం. పనిలో పని కదా అని ఇలా వచ్చేసాం" అంటూ గవర్నమెంటు ప్లీడరు పంపిన జవాబును అందించాడు. రాజు ఆజవాబును శ్రద్ధగా చదివి 'వెరీ గుడ్, వెరీ గుడ్' అని తనలో తాను మూడు సార్లు గొణుక్కున్నాడు. రావుకి కాస్త ధైర్యం వచ్చింది. సుజాతకు మాత్రం మతిపోయింది. అంత ఘాటైన జవాబు చదివి వెరీగుడ్ అని ఎందుకంటున్నాడో అసలు బోధ పడలేదు. "అయితే ఇప్పుడు మేం ఏం చెయ్యాలి?" అంది సుజాత రాజుతో. రాజు విలాసంగా చిరునవ్వు నవ్వి "మీరు ఏమీ చేయనక్కర్లేదు. ఓ రెండు కాగితాల మీద సంతకం మాత్రం చేయండి" అని ఆమె దగ్గర రెండు కాగితాల మీద సంతకాలు తీసుకున్నాడు.

"కేసు ఎలా పెడతారు?" అంది సుజాత సంశయంగా.

"కన్‌జ్యూమర్ డిస్‌ప్యూట్లో పడేసి చూద్దాం" అన్నాడు రాజు. ఆమెకేమీ బోధపడలేదు. "కేసు విచారణ జరిగే రోజున నేను కోర్టుకు రావచ్చునా?" అంది అతనితో. "మీరు రానవసరం లేదు. మీకు ఆసక్తివుంటే నిరభ్యంతరంగా రావచ్చు. కారు పంపుతాను రండి మీకు ఇంట్రస్టు వుంటే" అన్నాడు. ఇద్దరూ రాజు దగ్గర సెలవు తీసుకుని ఇంటి మొహం పట్టారు. "ఏమిటోనండి, నోటీసు నేరుగా బోర్డు సెక్రటరీకే పంపితే ఈపాటికి తేలిపోను. మీ ఫ్రెండు కేసు ఎలా పెట్టబోతున్నాడో, ఎంత ఖర్చు అవుతుందో, ఎంతకాలం తిరగాలో ఏమీ చెప్పడు. ఏదో సామెత చెప్పినట్టు తయారైంది వ్యవహ

రం" అంది సుజాత నిష్ఠూరంగా రావుతో. తన స్నేహితుణ్ణి చులకన చేసి మాట్లాడినందుకు నొచ్చుకుని, "ఔను సామెత చెప్పినట్టే ఉంది. పెరటి చెట్టు మందుకు పనికి రాదు" అన్నాడు రావు తీవ్రంగా. సుజాత మరి మాట్లాడలేదు.

* * *

కేసు విచారణ జరిగే రోజున అనుకున్నట్టుగానే కోర్టు కెళ్లింది సుజాత. ఒక జడ్జికి బదులుగా ముగ్గురు కూచుని ఉన్నారు గద్దెమీద. వారికి ఎదురుగా లాయర్లు కూచోడానికి వరసగా కుర్చీలు వేసి ఉన్నాయి. ఇంకా వెనక లిటిగెంట్లు కూచోడానికి ఓ బెంచీ ఉంది. సుజాత బెంచి మీద కూర్చుని ఉంది. ఆమె తప్ప ఆకోర్టు హాల్లో అంతా లాయర్లే వున్నారు. ఇంతలో రాజు కోర్టు హాల్లో ప్రవేశించి సుజాత పక్కన బెంచి మీద చతికిల పడ్డాడు. "మొదటి వరుసలో నల్లగా దుక్కలా వున్నాడే అతనే గవర్నమెంటు ప్లీడరు. అతను స్కూలు తరపున వాదిస్తాడు. ఈ చివర కూర్చున్న బట్టతలాయన రాజధాని నుంచి వచ్చాడు మనకేసు కోసం. అతను సెకండరీ బోర్డు తరపున వాదిస్తాడు" అంటూ సుజాతకి వివరించాడు రాజు.

"ఈ కోర్టు విచిత్రంగా ఉందే" అంది సుజాత.

"ఇది వినియోగదార్ల చట్టానికి చెందిన కోర్టు" అన్నాడు రాజు. ఇంతలో సుజాత కేసు పిల్చారు. రాజు ముందు వరుసలోకి వెళ్లి బాగా వాదిస్తాడు, అనుకుంది సుజాత. కానీ అలాంటిదేమీ జరగలేదు. అతను కూర్చున్న చోటునుంచే లేచి "సర్టిఫికేట్ కేస్ యువరానర్" అని తిరిగి సుజాత పక్కన కూర్చున్నాడు. తర్వాత కోటు జేబులోంచి చూయింగ్‌గమ్ తీసి నోట్లో వేసుకుని అదే పనిగా నమలనారంభించాడు. స్కూలు వారి వకీలు, బోర్డు వారి వకీలు చాలా తీవ్రంగా వాదోపవాదులు చేసుకున్నారు. ఆర్గ్యుమెంటు అవుతున్నంతసేపు రాజు చూయింగ్ గమ్ నములుతూనే ఉన్నాడు. వాదనలు ముగిసాయి. రాజు లేచి సుజాతను కూడా లెమ్మని సైగ చేసాడు. ఇద్దరూ బయట వరండాలోకి వచ్చారు.

"మీరో గంట వెయిట్ చేయగలిగితే కారు వస్తుంది" అన్నాడు రాజు.

"ఫర్వాలేదండీ నేను వెళ్లి పోగలను" అని అతనికో నమస్కారం చేసి రిక్షాలో ఇంటికి చేరుకుంది సుజాత. సాయంత్రం ఆరుగంటలకు ఇంటికి చేరుకున్నాడు రావు. "కోర్టుకెళ్లావా?" అని అడిగాడు భార్యని.

"ఆఁ, వెళ్లాను. మనకేసు విచారణ జరిగింది. నాకు అర్థం కాలేదనుకోండి. కాని స్కూలు తరపు వకీలు, బోర్డు తరపున వకీలు చాలా తీవ్రంగా వాదించుకున్నారు" అంది ఎత్తి పొడుస్తూ.

"అంటే, మా వాడు నీళ్లు నములుతూ కూర్చున్నాడా" అన్నాడు రావు.

"అబ్బే లేదు, చూయింగ గమ్ నములుతూ కూర్చున్నాడు" అంది సుజాత. రావు మరి మాట్లాడలేదు.

* * *

మరో నెల రోజులు గడిచాయి. సెకండరీ బోర్డు వారి దగ్గర్నుంచి రిజిష్టర్డు పోస్టులో సుజాత ఒరిజినల్ సర్టిఫికేట్ వచ్చేసింది. ఆమె ఆనందానికి అవధుల్లేవు. లాయర్ రాజుని చిన్నచూపుతో చూసినందుకు చాలా బాధపడింది. సాయంత్రం ఇంటి కొచ్చిన రావుతో "ఏమండీ, నా సర్టిఫికేట్ వచ్చేసింది. అన్నట్టు మీ ఫ్రెండుని కలుసుకున్నారా తర్వాత" అని అడిగింది. "కంగ్రాచ్యులేషన్స్ సుజీ. నేను మళ్లీ రాజుని కలుసుకోలేదు. కనీసం స్టాంపు ఖర్చులు కూడా ఇవ్వలేదు. ఇప్పుడే వాడి దగ్గరకెళ్లి ఈ సంగతి చెప్పొస్తాను" అన్నాడు రావు. "నేనూ వస్తాను" అంది సుజాత. ఇద్దరూ తయారై రాజు దగ్గరకు బయల్దేరారు. వీళ్లు చేరేసరికి రాజు ఒక్కడే వున్నాడు ఆఫీసులో.

"వెల్‌కమ్, వెల్‌కమ్" అన్నాడు రాజు ఆదంపతుల్ని ఆహ్వానిస్తూ.

"బ్రదరూ, సర్టిఫికేట్ వచ్చేసింది" అన్నాడు రావు.

"కంగ్రాచ్యులేషన్స్, మా వదిన గారికి మాత్రం నా తెలివి తేటల మీద నమ్మకం లేదు, ఆ సంగతి నాకు తెలుసు" అన్నాడు సుజాతను చూసి.

"ఆమె బయట పడిపోయింది, నేను పడ లేకపోయాను నువ్వు నా ఫ్రెండు కనక" అన్నాడు రావు నవ్వుతూ. "నీ మొహంకాకపోయింది. కనీసం కేసు గెలిచామో ఓడేమో కనుక్కోడానికి రాకూడదా...! నువ్వూ నీ చాదస్తమూను" అన్నాడు రాజు.

"ఐ యామ్ సారీ"

"డోంట్ బి సారీ, బీ హేపీ. మీకు ఐదు వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించమని కూడా ఆర్డరయ్యింది" అన్నాడు రాజు.

"నిజంగా?" అన్నారు భార్యభర్తలిద్దరూ ఆనందంతో.

"మరేమిటనుకున్నావు. నువ్వు నేరుగా సెక్రటరీకి నోటీసు పంపించి వుంటే మీ సర్టిఫికేట్‌ను మీరు పొంది వుండేవారు. ఇది ఎంత ప్రజాహిత చట్టమైనప్పటికీ ఫిర్యాదు చేసే వ్యక్తి తన కేసును తాను నిరూపించుకోవాలి. హెడ్మిస్ట్రెస్‌కి నోటీసు పంపించడం వలన వాళ్ల వకీలు మన కేసును పూర్తిగా నిరూపించి మనకి పని లేకుండా చేసాడు. అతని వల్లే మనకి నష్ట పరిహారం కూడా ఎక్కువ వచ్చింది" అన్నాడు రాజు.

"ఆ ఐదువేలూ ఫీజుకింద నువ్వే తీసుకో" అన్నాడు రావు నవ్వుతూ. "వద్దు బ్రదర్. ఆ డబ్బు వస్తే వదిన గారికి ఓ పట్టుచీర కొనివ్వు" అన్నాడు రాజు నవ్వుతూ.

